
క్లుప్తంగా

కూర్మావతారంలో జగన్నాథుడు


కూర్మావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: కూర్మావతారంలో జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంఖు, చక్రాలను ధరించి భక్తులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టుగా ఉన్న జగన్నాథుని కూర్మావతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 3,01,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన పి.వెంకట సుబ్రహ్మణ్యం రూ. 1,00,116, అలవ ప్రదీప్ రూ. 1,00,000, కృష్ణాజిల్లా దోసపాడుకు చెందిన చదలవాడ రామకోటేశ్వరరావు రూ. 1,01,116 లను నిత్యాన్నదాన ట్రస్టుకు జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

నూతన బస్సులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బస్‌డిపోకు వచ్చిన నూతన బస్సులను సోమవారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. వీటిలో రెండు స్టార్‌లైన్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులు కాగా, వీటిని హైదరాబాద్ సర్వీసులుగా తిప్పనున్నారు. మూడవ బస్సు ఏసీ సూపర్ డీలక్స్ బస్సు కాగా, దీనిని విశాఖపట్నం నడపనున్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఎస్‌వీఆర్ ప్రసాద్, డిపో మేనేజర్ ఎం.గంగాధరరావు, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

సౌకర్యాల ఏర్పాటుకు కృషి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం బస్టాండ్‌లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆర్టీసీ ఆర్ఎం ఎస్‌వీఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ పి.గంగాధరరావుతో కలిసి ఆయన కొయ్యలగూడెం బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు బస్టాండ్‌లో వసతుల లేమి గురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బస్సుల సమాచారం తెలుసుకునేందుకు శాశ్వత చిరునామాతో కలిగిన ఫోన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్యాన్ల సౌకర్యం కల్పించాలని, బస్టాండ్ ప్రాంగణంలోకి ప్రైవేటు వాహనాలను రానీయకుండా చూడాలని ఆర్ఎంను ఈ సందర్భంగా కోరారు. అనంతరం అధికారులు మరుగుదొడ్లను పరిశీలించి శానిటేషన్‌పై సిబ్బందికి సూచనలు అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

కుక్కునూరు: సీపీఐ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కుక్కునూరు మండల కౌన్సిల్ సమావేశం మాజీ జెడ్పీటీసీ సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు వరకా శ్యామల అధ్యక్షతన జరిగింది. ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, కారం దానయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా, కుక్కునూరు, వేలేరుపాడు మండల కార్యదర్శులు మైసాక్షి వెంకటాచారి, బాడిస రాము పాల్గొన్నారు.

9 అర్జీలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పునరావృతం కాని విధంగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, వితంతు పెన్షన్, మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

టీడీపీ దాడులపై ఖండన

టి.నరసాపురం: వేలేరుపాడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్‌పై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడడంపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులకు పాల్పడుతూ దాడులు చేస్తున్నారని, ఇవి పిరికిపంద చర్యలని పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల కమిటీ సభ్యుడు పిల్లి దుర్గారావు అధ్యక్షత వహించారు. మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గత 15 వారాలుగా వేతన బకాయిలు చెల్లించడం లేదని, దీంతో వారు పస్తులు ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జె.సూర్యచంద్రరావు, యాగంటి సీత, వి.నరసరావు, నేలపాల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో వైఎస్సార్ చిరస్మరణీయుడు

- మహానేతకు నివాళులర్పించిన నేతలు
- వాడవాడలా ఘనంగా వైఎస్సార్ జయంతి

చింతలపూడి.: పేదల హృదయాల్లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడిగా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంభం విజయరాజు అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారుతీనగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, పార్టీ నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జగ్గవరపు జానకిరెడ్డి, సీనియర్ నాయకులు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకలు గిరి భోగారావు, ఎం రాంబాబు, యర్రంశెట్టి రామకృష్ణారావు, ఆతుకూరి సుబ్బారావు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం దిలీప్, వెంపా కృష్ణ, ఎస్ కాంతారావు, రామరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యర్రంపల్లిలో జగ్గవరపు జానకిరెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్‌చేశారు. సీతానగరంలో రక్తదానం నిర్వహించారు. ప్రగడవరం, పోతునూరు, యర్రగుంటపల్లి, వెంకటాద్రిగూడెం, రేచర్ల గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలు మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

అపర భగీరథుడు వైఎస్సార్

జంగారెడ్డిగూడెం: అపర భగీరథుడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. దివంగత వైఎస్సార్ జయంతిని సోమవారం జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. విజయరాజుతోపాటు సీనియర్ నాయకులు జెట్టి గురునాథరావు, పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచారు. విజయరాజు మాట్లాడుతూ కామవరపుకోటలో మెట్ట ప్రాంతంలోని 230 గ్రామాల్లో 2 లక్షల ఎకరాలకు సాగునీరందించడానికి చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అపర భగీరథుడు అని అన్నారు. ఆరోగ్య, 108 వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాలులు అర్పించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మేడవరపు విద్యాసాగర్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కాసర తులసిరెడ్డి, వందనపు వెంకటేశ్వరరావు, ముప్పిడి శ్రీను, బత్తిన చిన్న, పీపీఎస్ చంద్రరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్‌వీఆర్ పాల్గొన్నారు. 4వ వార్డు ఇందిరా నగర్ కాలనీ కొత్తపేటలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌ఛార్జ్ చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు.


చింతలపూడి: ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


చింతలపూడి: పోతునూరులో వైఎస్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు


జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బాబ్జి

ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్

రాష్ట్ర మాజీ హోం మంత్రి వనిత

ద్వారకాతిరుమల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్ల మంది ప్రజల గుండె చప్పుడని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత కొనియాడారు. పంగిడిగూడెంలో వైఎస్సార్ సీపీ నేత పెదబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి పార్టీ శ్రేణులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో వైఎస్సార్ అంటే ఒక బ్రాండ్ అన్నారు. పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. నాడు వైఎస్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తంగా ఇప్పటికీ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. జగనన్నలో ప్రవహిస్తున్నది రాజన్న రక్తమని, తండ్రికి తగ్గ తనయుడిగా పాలన సాగించారన్నారు. కూటమి కుట్రల కారణంగా మనం ఓడిపోయాము తప్పా, ప్రజల హృదయాల్లో చెరగని ముద్రగా ఉన్నామన్నారు. జగనన్న మనకు అండగా ఉన్నారని, అతి త్వరలోనే మనకు మంచి రోజులు వస్తాయన్నారు. అప్పటి వరకు కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు.


ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర మాజీ హోం మంత్రి వనిత

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వైఎస్సార్

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రగా నిలిచారని ఎంపీపీ బొండాడ మోహిని అన్నారు. ద్వారకాతిరుమలలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ మోహిని పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, తదితరులకు తినిపించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు తదితరులున్నారు.


జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వాడవాడలా వైఎస్సార్ జయంతి

జంగారెడ్డిగూడెం రూరల్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జువరపు తాతారావు పాల్గొన్నారు. లక్కవరంలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురవాయిగూడెం, తిరుమలాపురంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

కామవరపుకోట: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పేదల హృదయాల్లో అభివృద్ధి ప్రదాతగా చిరస్మరణీయంగా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా తడికలపూడి, కొత్తూరు బస్టాండ్ ఎదురుగా, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, రావికంపాడులోని రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, పోలిమెట్ల ప్రశాంత్, బూరుగు శ్రీను, ఎస్‌కే కరిముల్లా, కామవరపుకోట ఉపసర్పంచ్ మేడూరు రంగబాబు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయసాధనకు కృషి చేయాలి

లింగపాలెం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషిచేయాలని కంభం విజయరాజు పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలను లింగపాలెం మండలంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ ఆధ్వర్యంలో విజయరాజు, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, గ్రామ సర్పంచ్ తగరం హేమలత వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మునునూరి వెంకటేశ్వరరావు, సొంగా సందీప్, సర్పంచ్‌లు ఇనుగంటి రాజేష్, తాడేపల్లి శాంతరావు, ప్రసాద్, ఎం.హేమప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో వైఎస్సార్‌కు నివాళులర్పించిన ఎంపీపీ జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు


కామవరపుకోట: కొత్తూరు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న కంభం విజయరాజు, పార్టీ శ్రేణులు


లింగపాలెం: వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు


లింగపాలెం: ధర్మాజీగూడెంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మన్యంలో మహానేతకు ఘన నివాళి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బుట్టాయగూడెంలోని అరుంధతీ నగర్ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అదేవిధంగా కృష్ణాపురంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, సర్పంచ్‌లు పాడియం లక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు, పెడకం విజయలక్ష్మి, మాల్చి వెంకన్నబాబు, ఉయికే బొజ్జి, ఎంపీటీసీ తెల్లం రమణ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్‌పాలెంలో సయ్యద్ బాజీ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోయరాజమండ్రి, దొరమామిడి, ముప్పినవారిగూడెం, కె.బొత్తప్పగూడెం తదితర గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు ఆయా గ్రామాల్లో నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జీలుగుమిల్లి, ములగలంపల్లిలో పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

వైఎస్సార్‌కు భారతరత్న ప్రకటించాలి

కొయ్యలగూడెం: మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డికి భారతరత్న పురస్కారం ప్రకటించాలి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం టౌన్ కన్వీనర్ సంకుకొండ ఆధ్వర్యాన వైఎస్సార్ నగర్‌లోని మహానేత విగ్రహం వద్ద వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు మేకల అన్నవరం, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు. రాజవరంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, సర్పంచ్ చిన్న తుక్కయ్య, గవరవరంలో ఎంపీటీసీ బి.రత్నకుమారి, గ్రామ కన్వీనర్ చీమకుర్తి సత్యనారాయణ, అంకాలగూడెం, యర్రంపేట, సరిపల్లి, అచ్చుతాపురం, బోడిగూడెం, చొప్పరామన్నగూడెం, బయ్యన్నగూడెం గంగవరం గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

టి.నరసాపురం: వైఎస్సార్ జయంతి సందర్భంగా టి.నరసాపురంలో పార్టీ మండల యూత్ నాయకులు సీతారామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్‌ను కట్ చేశారు. రాజుపోతేపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. కృష్ణాపురంలో మాజీ ఎంపీటీసీ భూక్యా వెంకటేష్ ధారవతు రమేష్ ఆధ్వర్యంలో పాఠశాలల పిల్లలకు, అంగన్‌వాడీ చిన్నారులకు పరీక్షప్యాడ్‌లు పంపిణీ చేశారు. వేణు ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి మొక్కలు నాటారు. టి.నరసాపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మోదుగు సునంద, ఎంపీటీసీ నార్లపాటి వెంకట్రావు, కటకం మల్లికార్జునరావు, నల్లూరి శ్రీనివాస్, రాజుపోతేపల్లిలో జరిగిన కార్యక్రమంలో బొంతు అంజిబాబు, కొల్లి పురుషోత్తం, బలుసు కృష్ణ, ఆలూరి నందకుమార్, కనిపెడ లక్ష్మీనారాయణ, దారా జయరాజు, కొలుకులూరి రాంబాబు పాల్గొన్నారు.


వైఎస్సార్‌కు ఘన నివాళి

పోలవరం రూరల్: ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వింజరం గ్రామంలో జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, ఎంపీపీ కుంజం చిట్టిమ్మ, కొత్తపట్టిసీమ గ్రామంలో మైగాపుల దుర్గాప్రసాద్, అడ్డగర్ల సాయిబాబ, వలవల బాలాజీ, గూటాలలో ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, సుంకర కొండబాబు, జల్లేపల్లి శివరామకృష్ణ, గంధం రాజు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కుక్కునూరు: కుక్కునూరు ప్రధాన సెంటర్లో మహానేత విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కొండపల్లిలో వైస్ ఎంపీపీ తాండ రాజేష్, వెంకటాపురం, దాచారంలో ఇతర గ్రామాల్లో మహానేత విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. నాయకులు మాదిరాజు వెంకన్నబాబు, రావు వినోద్, చిన్న నరసింహారాజు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, రాయి రవి, రాయి సత్యనారాయణ, కొటారు పవన్, చలపతి, ఊట్కూరు సతీష్ సూర్ల రాము తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


బుట్టాయగూడెం: ములగలంపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


కొయ్యలగూడెం: వైఎస్సార్ నగర్‌లో మహానేతకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: చొప్పరామన్నగూడెంలో వైఎస్సార్‌కు జోహార్లు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


టి.నరసాపురం: వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ


టి.నరసాపురం: రాజుపోతేపల్లిలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


పోలవరం: పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


కుక్కునూరు: వైఎస్సార్ జయంతి నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

మూతబడిన ఆర్వో వాటర్ ప్లాంట్

కొయ్యలగూడెం: కన్నాపురంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ సోమవారం వివాద కారణంగా మూతబడింది. ఆర్వో ప్లాంట్‌ను నిర్మించిన దాతలకు పంచాయతీకి సంబంధించిన ప్రజాప్రతినిధి బంధువుకి మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఆర్వో ప్లాంటు తాళం వేయడం జరిగింది. డాక్టర్ కొడాలి సత్యనారాయణ, కె.సూర్య కుమారి తెలిపిన వివరాల మేరకు అవంతి ఫీడ్స్ సౌజన్యంతో సుమారు రూ.30 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్‌తో సహా ఒక షాపు, మరో ఆరు చోట్ల తాగునీటి వాటర్ ట్యాంకులు గతేడాది మార్చిలో నిర్మించినట్లు తెలిపారు. అయితే పంచాయతీకి సంబంధంలేని ఒక వ్యక్తి వీటిని ఆక్రమించి సుమారు ఏడాదిన్నర నుంచి షాపును అద్దెకు ఇవ్వడంతో పాటు ఆర్వో వాటర్ ప్లాంట్‌పై వస్తున్న సొమ్మును స్వాహా చేస్తున్నాడని ఆరోపించారు.